ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన మహిళలు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు ప్రతినిధులు, నాయకులు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆయా శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేగాకుండా జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి సమస్యల పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

మర్యాదపూర్వక కలయిక



శాసనమండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న హన్మంతరెడ్డి, నాయకులు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వ శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో సూరారం డివిజన్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేయగా మహేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, వెంకటేశ్, రజాక్, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

75వ రోజుకు నిత్య పూలమాల కార్యక్రమం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ యాదగిరి

సుభాష్‌నగర్: భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని చేపట్టిన నిత్య పూలమాల కార్యక్రమం 75వ రోజుకు చేరుకుంది. సోమవారం సూరారం కాలనీ జడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపాల్ యాదగిరి, పీఈటీ నాగరాజు విద్యార్థులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చితే విద్యార్థులకు హక్కులు, విధులు, రాజ్యాంగ ఔన్నత్యంపై అవగాహన కలుగుతుందన్నారు. ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చే విద్యా సంవత్సరంలోనైనా పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు.

సత్కారం, శుభాకాంక్షలు



ఎమ్మెల్యే హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: బౌరంపేట కౌన్సిలర్, బీఆర్ఎస్ నేత నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వారు శ్రీనివాస్‌రెడ్డిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పూజలు

కుత్బుల్లాపూర్: కొంపలి మున్సిపల్ పరిధి ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలోని నోబుల్ పార్కులో శ్రీభారతీ తీర్థ మహాస్వామి పాదుక పూజను మంగళవారం నిర్వహించనున్నట్లు శ్రీదుర్గాదేవి సేవా సమితి సభ్యుడు రాచర్ల రవిచంద్ర శర్మ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల దసరా సందర్భంగా భాగంగా శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు. భారతీ తీర్థ మహాస్వామి సన్యాసం స్వీకరించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆశ్వీజమాస బహుళ ద్వాదశి పాదుక పూజ నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జగద్గురు తీర్థ ప్రసాదాలు స్వీకరించి వారి అనుగ్రహం పొందాలని సరస్వతీ ఉపాసకులు కోరారు.

సబ్‌రిజిస్ట్రార్‌ను విచారించిన పోలీసులు

జీడిమెట్ల: జీడిమెట్ల పీఎస్ పరిధిలోని సుభాష్‌నగర్ వెంకటాద్రినగర్‌లో 200 గజాల ఖాళీ స్థలాన్ని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన కేసులో సబ్‌రిజిస్ట్రార్‌ను పోలీసులు సోమవారం విచారించారు. స్థానిక బీఆర్ఎస్ మహిళా నాయకురాలు పద్మజారెడ్డి సదరు స్థలాన్ని కాజేసేందుకు ఆరుగురు వ్యక్తుల సహకారంతో స్థల యజమాని మృతిచెందినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్, నకిలీ పాన్ కార్డు ఆధార్‌కార్డును సృష్టించింది. గతేడాది ఫిబ్రవరిలో అప్పటి కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ జ్యోతి సహకారంతో పద్మజారెడ్డి తన సోదరి పేరుమీద స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ విషయాన్ని స్థల యజమాని గుర్తించి జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలోనే పద్మజారెడ్డి పాత్ర ఉన్నట్లు తెలిసిన ఈనెల 4న అరెస్టు చేసి ఆమెతో పాటు సహకరించిన వారిని రిమాండ్‌కు తరలించారు. తమకు సబ్‌రిజిస్ట్రార్ సహకరించినట్లు ఆమె విచారణలో తేలడంతో సోమవారం రాత్రి సబ్‌రిజిస్ట్రార్‌ను స్టేషన్‌కు పిలిపించి రిజిస్ట్రేషన్ ఎలా చేశారని ఆమెను విచారించినట్లు తెలిసింది.

విద్యుత్ సిబ్బంది ప్రతిజ్ఞ

కూకట్‌పల్లి: విజిలెన్స్ అవేరేనెస్ వారోత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్ డివిజన్ ఏడీఈ బి.మాణిక్యాలు సిబ్బందితో డివిజన్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ఏఈలు విజయ్ ప్రకాష్, భీమప్ప, విజిలెన్స్ కానిస్టేబుల్ ఆంజనేయులు, కేపీహెచ్‌బీ బాలానగర్ సెక్షన్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చకచకా రోడ్ల విస్తరణ..!

రూ.4.58 కోట్ల నిధులతో చౌరస్తాలు, రహదారుల పనులు

- ట్రాఫిక్ నియంత్రణకు జీహెచ్ఎంసీ చర్యలు
- పలుచోట్ల పూర్తి, మిగతా చోట్ల ముమ్మరంగా నిర్మాణాలు



గాజులరామారం గ్రామ చౌరస్తాలో పూర్తయిన విస్తరణ

రంగారెడ్డినగర్: ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు జంట సర్కిళ్ల పరిధిలో చేపట్టిన ప్రధాన చౌరస్తాలు, రోడ్ల విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి. గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలోని గాజులరామారం చౌరస్తా, షాపూర్‌నగర్- గాజులరామారం చౌరస్తా, షాపూర్‌నగర్- రంగభుజంగ చౌరస్తా మీదుగా సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డు, జగద్గిరిగుట్టలోని చాకలి ఐలమ్మ చౌరస్తా, కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటాయి. ఈ ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ జాంలు తలెత్తడంతో ట్రాఫిక్ అధికారుల సూచనల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు రూ.4.58 కోట్ల నిధులతో విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు.

పూర్తయిన ప్రాంతాలు..

గాజులరామరం సర్కిల్ పరిధిలోని గాజులరామారం గ్రామ చౌరస్తా ఓ వైపు మియాపూర్ మీదిగా గాజులరామారం గ్రామం, మరోవైపు కూకట్‌పల్లి, ఇంకోవైపు షాపూర్‌నగర్ ప్రాంతాలకు అనుసంధానంగా ఉంది. ఇక్కడ రూ. 1.27 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రోడ్డు ఆక్రమణలను తొలగించి వాహనాలు సాఫీగా వెళ్లేలా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు మాత్రమే మిగిలి ఉంది.

జగద్గిరిగుట్టలోని చాకలి ఐలమ్మ చౌరస్తా..

జగద్గిరిగుట్టలోని చాకలి ఐలమ్మ చౌరస్తాను రూ. 48 లక్షలతో విస్తరించారు. ఇప్పటికే రోడ్ల విస్తరణ పూర్తికాగా, అడ్డంగా ఉన్న విద్యుత్‌స్తంభాల తొలగింపు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు పనులు మిగిలి ఉన్నాయి.

కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో..

కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని కుత్బుల్లాపూర్‌కు వెళ్లే మార్గంలో రూ.1.26 కోట్లతో విస్తరణ చేపట్టారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఎదుట దాదాపు పూర్తి కావచ్చింది. నాలా ప్రాంతంలో కుచించుకుపోగా ఇటీవల కల్వర్ట్ పనులు కూడా పూర్తి చేశారు. రోడ్డు విస్తరణ ప్రక్రియ మిగిలి ఉంది. రోడ్డుకు అడ్డంగా ఉన్న వృక్షాలను సర్కిల్ అధికారులు ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయనున్నారు. వాటిని సూరారం అటవీ ప్రాంతంలో నాటుతామని అటవీ అధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే చెట్లను తరలిస్తామని కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీగణేశ్ 'సాక్షి' కి తెలిపారు.



షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్ వద్ద కొనసాగుతున్న పనులు



షాపూర్‌నగర్ రంగ భుజంగ చౌరస్తాలో ..

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు..



ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలో గాజులరామారం చౌరస్తా, షాపూర్‌నగర్ సిగ్నల్స్, షాపూర్‌నగర్-రంగ భుజంగ చౌరస్తా, కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా, సూరారం చౌరస్తా, ఐడీపీఎల్ చౌరస్తాలు ఉండడంతో విధి నిర్వహణ కత్తిమీద సాముగా ఉంటోంది. నూతన చౌరస్తాల విస్తరణ పూర్తయితే సిబ్బందిపై ఒత్తిడి తగ్గడంతో పాటు వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు కూడా తీరుతాయి.

-బి.శ్రీనివాస్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ



జగద్గిరిగుట్ట చాకలి ఐలమ్మ చౌరస్తా వద్ద పూర్తయిన రోడ్‌వైడెనింగ్



షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డు స్వాగత్ హోటల్ సమీపంలో పూర్తయిన పనులు

విస్తరణ కొనసాగుతున్న ప్రాంతాలు..

షాపూర్‌నగర్-గాజులరామారం చౌరస్తా, షాపూర్‌నగర్-రంగభుజంగ చౌరస్తాల్లో రూ.1.57 కోట్లతో విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రంగ భుజం చౌరస్తాలోని షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డు విస్తరణ పూర్తి కాగా, రంగ భుజంగ నుంచి షాపూర్‌నగర్ సిగ్నల్ వరకు, అదేవిధంగా రంగ భుజంగ థియేటర్ మీదుగా సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డు పనులు సాగుతున్నాయి. అయితే పలుచోట్ల పనులకు ఎస్‌సీ విద్యుత్ లైన్‌లు అడ్డుగా ఉండడంతో విస్తరణ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఎల్‌సీ లైన్‌కావడంతో రోజుకు 4 గంటల పాటు మాత్రమే స్తంభాలను మార్చేందుకు ఆ శాఖ అధికారులు అనుమతులు ఇస్తున్నారని, మరో రెండు, మూడు రోజుల్లో స్తంభాల మార్పిడి పనులు పూర్తవుతాయని గాజులరామారం సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిష్టప్ప తెలిపారు. ఈ చౌరస్తాలో విస్తరణ పూర్తయితే సుభాష్‌నగర్ మీదుగా సుచిత్ర, మేడ్చల్‌కు వెళ్లే వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

మేయర్‌ను కలిసిన కమిషనర్



మేయర్ నీలారెడ్డితో కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డిని కమిషనర్ సాబేర్ అలీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు శుభకాంక్షలు తెలిపిన ఆమె పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. విధుల నిర్వహణలో తన పూర్తి సహకారాలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఆయన వెంట కార్పొరేషన్ మేనేజర్ పవన్ కుమార్, అధికారులు దాసయ్య, సుకృత తదితరులు ఉన్నారు.

వృథాగా తాగునీరు..!



కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్‌కార్యాలయ ఆవరణలో పారుతున్న తాగునీరు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ ఆవరణ నుంచి వెళ్తున్న పైపులైన్‌కు సోమవారం భారీ లీకేజీ ఏర్పడింది. ఉదయం వేళలో నీటి సరఫరా ప్రారంభించగానే కార్యాలయ ఆవరణలో క్యాష్ కౌంటర్ పక్కనే ఉన్న పైప్‌లైన్‌కు ఉన్న వాల్వ్‌కు లీకేజీ ఏర్పడడంతో తాగునీరంతా వృథాగా పారింది. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

దుండిగల్: మల్లంపేటలో ట్రాఫిక్ కారణంగా వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే 100 ఫీట్ల రోడ్డును నిర్మించాలని కోరుతూ స్థానికులు ప్రజావాణిలో మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాచుపల్లి రెడ్డీస్ ల్యాబ్ నుంచి ప్రణీత్ ఆంటీ విల్లాలు , కత్వ చెరువు మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు మాస్టర్ ప్లాన్‌లో ఉన్న విధంగా 100 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా శంభీపూర్ నుంచి బాచుపల్లి చౌరస్తా వరకు 40 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉందని, ఇరువైపులా అక్రమ నిర్మాణాలను తొలగించి విస్తరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని ..

దుండిగల్: గండిమైసమ్మలోని డబుల్ బెడ్రూం సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ దుండిగల్ గండిమైసమ్మ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సముదాయంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, గండిమైసమ్మ చౌరస్తా నుంచి ఇళ్ల వరకు వీధి లైట్లు, అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డబుల్ బెడ్రూం వాసులు భాస్కర్, రాజు, చాంద్, నాగమణి, వెంకట్, శ్వేత, పుష్ప, భారతి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ సత్యనారాయణకు వినతి పత్రం ఇస్తున్న లింగస్వామి

గౌడ కులస్తులకే స్థల హక్కులు కేటాయించాలి

దుండిగల్: దుండిగల్ గ్రామంలోని సుమారు 250 కుటుంబాలు కల్లు దుకాణంపై ఆధారపడి జీవిస్తున్నాయని ఆ స్థల హక్కులు తమ కులస్తులకే కేటాయించాలని దుండిగల్ గౌడ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం దుండిగల్‌లో గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం అప్పటి గ్రామ పెద్దలు 350 గజాల స్థలాన్ని కల్లు కాంపౌండ్‌కు కేటాయించారని, 20 ఏళ్లుగా పన్నులు సైతం చెల్లిస్తున్నామన్నారు. కానీ కొందరు వ్యక్తులు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని, సదరు స్థలానికి సంబంధించిన పూర్తి హక్కులను తమకే కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు ఎల్.నర్సింగ్‌గౌడ్, ఎల్.భిక్షపతిగౌడ్, పాండుగౌడ్, లింగం గౌడ్, పాండురంగ గౌడ్, శివుడు గౌడ్, కుమార్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గౌడ సంఘం నేతలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో ఈ నెల 29న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొంపల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 200 కేవీ షాపూర్‌నగర్, మల్కారామ్ ఫీడర్ మరమ్మతుల పనుల కారణంగా 11కేవీ ధూలపలి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ధూలపల్లిలోని సాయిహోమ్స్, కుమ్మరి బస్తీ, అంబేడ్కర్ బస్తీ, రామాలయం రోడ్డు, మున్సిపల్ కార్యాలయ రోడ్డు, కృష్ణానగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన

దుండిగల్: అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సదర్ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో యాదవ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిజాంపేటలో నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి హాజరు కావాలని యాదవ కులస్తులు సోమవారం భూపతిరెడ్డిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆవుల సురేశ్ యాదవ్, కార్పొరేటర్ ఆవుల జగదీశ్ యాదవ్, శ్రీశైలం యాదవ్, కుమార్ యాదవ్, మహేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ



తెరిచి ఉన్న బీరువా

దుండిగల్: ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లంపేట కేవీఆర్ లేఅవుట్ ప్రాంతానికి చెందిన ఎస్.కృష్ణ కిశోర్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కాగా తన భార్య, కుమార్తెతో కలిసి ఈ నెల 19న బెంగళూరు, గోవా ప్రాంతాలకు విహార యాత్రకు వెళ్లాడు. తిరిగి 27 న రాత్రి ఇంటికి వచ్చేసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 13 తులాల బంగారం, అర కిలో వెండి, రూ.30 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్ సర్వే నంబర్ 342 ప్రభుత్వ స్థలంలో వెలిసిన రెండు గదులు, రెండు బేస్‌మెంట్లు, డబ్బాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో తొలగించారు. ఆదివారం సెలవు కావడంతో కొంతమంది నిర్మాణాలు చేపట్టారని సమాచారం రావడంతో కూల్చివేశామని ఆర్ఐ తెలిపారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న ఆర్ఐ గులాం కలీం

కూల్చివేత అడ్డగింత..

దుండిగల్: అక్రమ నిర్మాణాలను కూల్చి వేసేందుకు వెళ్లిన అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగారు. వివరాల్లోకి వెళ్తే.. గాగిల్లాపూర్ తండా, దుండిగల్ తండా-2లో స్థానికులు నూతనంగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుండిగల్ మున్సిపల్ అధికారులు గతంలో 8 నిర్మాణాలను గుర్తించి వారికి నోటీసులు అందజేశారు. సోమవారం సదరు నిర్మాణాలను కూల్చివేసేందుకు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి సంజున, సిబ్బంది వెళ్లారు. దీంతో తండావాసులు వారిని అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. 50 ఏళ్లకు పైగా ఇక్కడ నివసిస్తున్నామని, పాత ఇళ్ల స్థానంలో కొత్తగా నిర్మించుకుంటున్నామని, వాటిని ఎలా కూలుస్తారని తండావాసులు నిలదీయడంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.



అధికారులను అడ్డుకుంటున్న తండావాసులు

బ్రిడ్జిని నాలుగు లేన్లుగా విస్తరించాలి

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డు బ్రిడ్జిని నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలని కోరుతూ నిజాంపేట్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఉప కమిషనర్ నరసింహకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ బ్రిడ్జి 13 ఫీట్ల వెడల్పు మాత్రమే ఉండడంతో ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. రూ.56 కోట్లతో నాలుగు లేన్ల స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే ఇప్పటి వరకు పనులను శంకుస్థాపన చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టెండర్లు పిలిచి వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గాజులరామరం సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్(2), రెవెన్యూ(1), అదేవిధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ (2), రెవెన్యూ(1), యూసీడీ(1), ఎలక్ట్రికల్ (1) ఫిర్యాదులు రాగా ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహలు తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ నరసింహకు వినతి పత్రం ఇస్తున్న సతీశ్

ఆలయంలో ఎమ్మెల్యే మాధవరం పూజలు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్ శ్రీ సాయి నాగేంద్రాలయంలో శ్రీధన్వంతరి స్వామి వారి విగ్రహ ప్రతిష్ట, స్వామి వారి సామూహిక కల్యాణంలో సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంబటి సునీల్, దేవాలయ నిర్మాణం, విగ్రహ దాత, పి.త్రికోటేశ్వరరావు, మందడి సుధాకర్ రెడ్డి, బొట్టు విష్ణు, దేవులపల్లి కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్, బాజని నాగేందర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, యం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

